నమస్తే తెలంగాణ

# ఖైరతాబాద్ | జూబ్లీహిల్స్ | రాజేంద్రనగర్

ఆదివారం 31 మార్చి 2024
SUNDAY, MARCH 31, 2024



## నేడు ఆస్తిపన్ను పరిష్కార వేదిక

జూబ్లీహిల్స్,మార్చి30 : ఆస్తి పన్ను చెల్లింపులో నెలకొన్న వివాదాల పరిష్కారానికి ఆదివారం జీహెచ్ఎంసీ 19వ సర్కిల్ కార్యాలయంలో 'ఆస్తిపన్ను పరిష్కార వేదిక' నిర్వహించనున్నట్లు డిప్యూటీ కమిషనర్ సేవా ఇస్లావత్ తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు యూసుఫ్‌గూడలోని జీహెచ్ఎంసీ కార్యాలయంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆస్తిపన్ను బకాయిలు ఉన్నవారు 2022-23 వరకున్న ఎరియర్స్‌పై 90 శాతం మాఫీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పాత బకాయిలపై కేవలం పది శాతం వడ్డీతో ఆస్తిపన్ను పూర్తిగా చెల్లించి.. నేటితో ముగియనున్న ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అసెస్‌మెంట్‌ల లోపాలతో పాటు వివాదాల పరిష్కారానికి సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు.

## గ్యాస్ గోదాంల వద్ద జాగ్రత్తలు తీసుకోవాలి

శంషాబాద్ రూరల్, మార్చి 30 : గ్యాస్ సిలిండర్ల గిడ్డంగి ఉన్న ప్రాంతాల్లో చెత్తాచెదారం నిల్వ ఉండకుండా ఆయా ఏజెన్సీ నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలని పౌర సరఫరాలశాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ మాచన రఘునందన్ స్పష్టం చేశారు. శనివారం శంషాబాద్ పట్టణంలోని గ్యాస్‌గోదాం పక్కన అగ్ని ప్రమాదం జరిగిన ఓల్డ్‌స్క్రాప్ దుకాణాన్ని పరిశీలించారు.



'రన్ ఫర్ జీసస్' కార్యక్రమంలో ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్, తదితరులు

## క్రైస్తవులకు గుడ్‌ఫ్రైడే రెండో అతి పెద్ద పండుగ..

### జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్..

జూబ్లీహిల్స్,మార్చి30: క్రైస్తవులు ప్రపంచవ్యాప్తంగా గుడ్ ఫ్రైడేను రెండో అతి పెద్ద పండుగగా జరుపుకుంటారని బీఆర్ఎస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ అన్నారు. శనివారం జూబ్లీహిల్స్ క్రిష్టియన్ ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన 'రన్ ఫర్ జీసస్' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా యూసుఫ్‌గూడ కృష్ణకాంత్ పార్కువద్ద నిర్వహించిన వేడుకల్లో అన్నదాన కార్యక్రమాన్ని, రన్ ఫర్ జీసస్ ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆదివారం జరుపుకోనున్న ఈస్టర్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంగళరావునగర్ కార్పొరేటర్ దేదీప్య విజయ్, ఫోరం ప్రతినిధులు, చర్చి పాస్టర్లు విజయ్ కుమార్, రాకేశ్, విలియం, బాబూరావు, వసంత్‌రావు పాల్గొన్నారు.

# 100 శాతం ఆస్తి పన్ను వసూలు..

- ఆదర్శంగా నిలుస్తున్న మదన్‌పల్లి కొత్తతండా
- మరుసగా ఆరోసారి మొదటిస్థానం
- శంషాబాద్ మండలంలోని 9 గ్రామ పంచాయతీల్లో వందశాతం ఆస్తిపన్ను వసూలు



మదన్‌పల్లి పాతతండా గ్రామ ముఖ చిత్రం

శంషాబాద్ రూరల్, మార్చి 30 : 2018 నుంచి నేటి వరకు ప్రతి సంవత్సరం వందశా తం ఆస్తి పన్ను వసూళ్లలో శంషాబాద్ మండలంలోని మదన్‌పల్లి పాతతండా ముందంజ లో ఉన్నది. నూటికి నూరుశాతం ఆస్తి పన్ను వసూలు చేయాలని ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజా ప్రతినిధులు, అధికారులు కలిసికట్టుగా పనిచేసి వంద శాతం ఆస్తిపన్నును వసూలు చేసి రం గారెడ్డి జిల్లాలోనే మొదటి వరుసలో నిలిపారు. మొత్తం 700 జనాభా ఉన్న మదన్‌పల్లి పాతతండా నేడు ఆదర్శంగా నిలిచింది. మండలంలో 9 గ్రామ పంచాయతీలలో కూడా వందశాతం ఆస్తిపన్ను వసూలును పూర్తి చేశారు.

అప్పటి సీఎం కేసీఆర్ 500 జనాభా ఉన్న గిరిజన తండాలకు, గూడెంలను ప్రత్యేక గ్రామ పంచాయతీలు చేస్తామని ఇచ్చిన హామీ మేరకు 2018 అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా శంషాబాద్ మండలంలోని మదన్‌పల్లితండా, మదన్‌పల్లి కొత్తతండా, అలీకోల్ తండా, పెద్దషాపూర్‌తండా, పెద్దతూప్ర తండాలను ప్రత్యేక పంచాయతీలుగా ప్రకటించారు. అప్పటి నుంచి నేటి వరకు వరుసగా ఆరోసారి మదన్‌పల్లి పాత తండా ఆస్తిపన్ను వసూళ్లలో నూటికి నూరుశాతం వసూలు చేసి రంగారెడ్డి జిల్లాలోనే మొదటిస్థానంలో నిలిచింది. మదన్‌పల్లి పాతతండా పంచాయతీలో 222 ఇండ్ల కు గాను 5,41,378 వందకు వందశాతం వసూలు చేశారు.

### 9 పంచాయతీల్లో పూర్తి....



మండలంలోని మదన్‌పల్లి పాతతండా,చిన్న గోల్కొండ, నానాజీపూర్, రషీద్‌గూడ,అ లీకోల్ తండా, పిల్లోనిగూడ, జూకల్, సుల్తాన్‌పల్లి, చౌదర్‌గూడ గ్రామ పంచాయతీలు వందశాతం ఆస్తి పన్ను వసూలును పూర్తి చేశాం. 27 గ్రామ పంచాయతీల్లోనూ పూర్తి చేయడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం.

– జి మున్నీ, ఎంపీడీవో శంషాబాద్

### ఆరు సంవత్సరాలుగా వందశాతం..



ప్రజలు, ప్రజాప్రతినిధుల సహకారంతో వంద శాతం ఆస్తిపన్ను వసూలు చేయగలిగాం. గత ఆరు సంవత్సరాలుగా వందశాతం ఆస్తిపన్ను వసూలు చేసి గ్రామాన్ని ఆదర్శంగా నిలుపుతున్నాం.

– శ్రీకాంత్, పంచాయతీ కార్యదర్శి

### ప్రజల సహకారంతోనే సాధ్యం..



గ్రామ పంచాయతీగా ఏర్పడినినాటి నుంచి మా తండాను అన్ని రంగాల్లో ఆదర్శంగా నిలుపాలనే లక్ష్యంతో ప్రత్యేక చొరవతీసుకొని ఇంటింటికీ తిరిగి ప్రజలకు అవగాహన కల్పించాం. ప్రజల సహకారంతో వందశాతం ఆస్తిపన్ను వసూలు చేశాం.

– నీలంనాయక్, ఎంపీటీసీ మదన్‌పల్లి పాతతండా





రాజేంద్రనగర్‌లో స్వీప్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన 5కే రన్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఆర్డీవో వెంకట్‌రెడ్డి

## ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి

బండ్లగూడ,మార్చి 30: ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకుని ప్రజా స్వామ్యాన్ని పరిరక్షించాలని రాజేంద్ర నగర్ ఆర్డీవో వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా రానున్న ఎన్నికల్లో ఓటర్ల శాతం పెంచేందుకు స్వీప్ నోడల్ అధికారి బి.శరత్‌చంద్ర ఆధ్వర్యంలో శనివారం రాజేంద్రనగర్‌లో వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థులతోపాటు పలు కళాశాలల విద్యార్థులతో ఓటు వినియోగంపై అవగాహన కార్యక్రమంలో భాగంగా 5కే రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో ..5కే రన్‌ను జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ తమ పేరును ఓటరు జాబితాలో చేర్పించుకోవాలన్నారు. పోలింగ్ తేదీన ప్రతి ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. తద్వారా సమర్థవంతమైన నాయకులను ఎంపిక చేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ జీహెచ్ఎంసీ ఉప కమిషనర్ రవికుమార్. మోప్మా రంగారెడ్డి జిల్లా అధికారి జ్ఞానేశ్వర్, శ్రీలత, తాసీల్దార్ రాములు, తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులకు చట్టసభల్లో అవకాశం కల్పించాలి



ఖైరతాబాద్, మార్చి 30 : దివ్యాంగులకు చట్ట సభల్లో అవకాశాలు కల్పించాలని మాజీ సింగిల్ విండో డైరెక్టర్ నాగినేటి జగదీశ్వర్ రావు కోరారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2016లో దివ్యాంగుల చట్టంలోని కొన్నింటిని మాత్రమే దేశంలోని పలు ప్రభుత్వాలు అమలు చేశాయని, మరికొన్నింటిని విస్మరించాయన్నారు. విద్య, వైద్యం, ఆర్థిక సాయం, స్వయం ఉపాధి, తదితర హక్కులను కల్పించాలన్నారు. స్థానిక సంస్థల నుంచి చట్టసభల వరకు దివ్యాంగులకు సరైన ప్రాతినిధ్యం లేదని, దీంతో తమ తరపున మాట్లాడేవారే లేరన్నారు. దివ్యాంగుల కోసం కేటాయించిన ఐదు శాతం రిజర్వేషన్లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పకడ్బందీగా అమలు చేయాలన్నారు. ఈ సమావేశంలో రాంబాబు, అర్విండ్, విఠల్, రాజు పాల్గొన్నారు.

## రాజ్యాంగాన్ని కాపాడుకోవాలి

హిమాయత్‌నగర్,మార్చి 30: మనువాదుల నుంచి భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని దళిత బహుజన పార్టీ (డీబీపీ) జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణ స్వరూప్ అన్నారు. సూర్యపేట జిల్లాకు చెందిన టీజేఏసీ జిల్లా మహిళా అధ్యక్షురాలు వేమిరెడ్డి లక్ష్మి రాజీనామా చేసి డీబీపీలో చేరారు. శనివారం హిమాయత్‌నగర్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో కృష్ణ స్వరూప్.. ఆమెను పార్టీలోకి ఆహ్వానించి.. మహిళా ఉపాధ్యక్షురాలిగా నియమిస్తూ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .. రాష్ట్రంలో సమాజిక, సమానత్వం, మానవ హక్కుల కోసం రాజకీయపరంగా పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేసే పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ హుజూర్‌నగర్ అసెంబ్లీ ఇన్‌చార్జి విజయ్, విద్యార్థి విభాగం రాష్ట్ర కో–ఆర్డినేటర్ ఇటికాల గణేశ్, నాయకులు శంబిరెడ్డి, రాజు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాలను నివారించండి..

మైలార్‌దేవ్‌పల్లి, మార్చి 30: ప్రధాన రహదారులపై రోడ్డుదాటే సమయంలో ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నారని.. వీటి నివారణకు రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసులు తగు చర్యలు తీసుకోవాలని నవయువయూత్ క్లబ్ అధ్యక్షుడు కుమారస్వామి, ఉపాధ్యక్షుడు రమేశ్‌రెడ్డిలు కోరారు. ఈ మేరకు శనివారం వారు.. రాజేంద్రనగర్ ట్రాఫిక్ సీఐ కిరణ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని ప్రధాన రహదారులపై రోడ్డుదాటే సమయంలో పలు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయన్నారు. ఎప్పుడు రద్దీ ఉండే ఈ ప్రాంతాల్లో ప్రజలు రోడ్డు దాటుతూ అనేకసార్లు గాయాలపాలవుతున్నారన్నారు. బాబుల్‌రెడ్డినగర్, మార్కండేయనగర్ ప్రాంతాల్లో ఈ సమస్య అధికంగా ఉందన్నారు. దుర్గానగర్ నుంచి ఆరాంఘర్ వరకు సురక్షితమైన పాదచారుల క్రాసింగ్ వద్ద చర్యలు తీసుకుంటే సమస్య తీరుతుందన్నారు. ఈ మేరకు ట్రాఫిక్ సీఐ తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు. వినతిపత్రం సమర్పించిన వారిలో అర్జున్, శ్రీను తదితరులున్నారు.



రాజేంద్రనగర్ ట్రాఫిక్ సీఐ కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సభ్యులు

## మద్యానికి బానిసై దొంగతనాలు

ఖైరతాబాద్, మార్చి 30 : మద్యానికి బానిసైన ఓ వ్యక్తి దొంగతనాలు చేసి కటకటాలపాలయ్యాడు. పంజాగుట్ట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... చిక్కడపల్లి జవహర్‌నగర్‌కు చెందిన కోట సాయి తేజ అమీర్‌పేటలోని ఓ హాస్టల్‌లో ఉంటున్నాడు. ఈ నెల 17న అమీర్‌పేటలోని ఓ హాస్టల్ వద్ద పార్క్ చేసిన ఉన్న స్కూటీని దొంగతనం చేశాడు. ఆ తర్వాత ఈ నెల 29న రాత్రి సోమాజిగూడలోని ఓ షాపింగ్ మాల్ వద్ద ఓ ఆటోను ఆపి అందులో ప్రయాణిస్తున్న వ్యక్తి వద్ద నగదు, సెల్‌ఫోన్ లాక్కున్నాడు. అంతటితో ఆగకుండా అతడిని బెదిరించి ఫోన్‌పే ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నాడు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు

## దేశంలో అన్ని సమస్యలకు జనాభే కారణం

### సుప్రీం కోర్టు న్యాయవాది అశ్విని ఉపాధ్యాయ్






సదస్సులో మాట్లాడుతున్న అశ్విని ఉపాధ్యాయ్

ఖైరతాబాద్, మార్చి 30 : దేశంలో అన్ని సమస్యలకు అధిక జనాభే కారణమని సుప్రీంకోర్టు న్యాయవాది అశ్విని ఉపాధ్యాయ్ అన్నారు. ప్రజ్ఞాభారతి ఆధ్వర్యంలో ఖైరతాబాద్‌లోని ది ఇనిస్టిట్యూటేషన్ ఆఫ్ ఇంజినీర్స్ ఇండియా తెలంగాణ రాష్ట్ర కార్యాలయంలో శనివారం సాయంత్రం జాతీయ జనాభా పాలసీపై సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన అశ్విని ఉపాధ్యాయ్ మాట్లాడుతూ.. భారతదేశంలో అనేక చట్టాలు అమలవుతున్నాయని, అయితే జనాభా నియంత్రణకు సరైన చట్టం లేకపోవడంతో ఆహారం, ఇతర కరువులు ఏర్పడుతున్నాయన్నారు. 50 శాతం సమస్యలు అధిక జనాభా వల్లే కలుగుతున్నాయన్నారు. అలాగే ఉన్న చట్టాల్లో లోపాలను సరిదిద్దాల్సిన అవసరం ఉందని, అమెరికా లాంటి దేశాల్లో దొంగతనం కంటే అది కప్పిపుచ్చుకోవడానికి చెప్పే అబద్ధమే అతి పెద్ద నేరంగా పరిగణిస్తారని, కానీ మన దేశంలో అబద్ధం అనేది కొందరు ఓ హక్కులా భావిస్తారన్నారు. దేశంలో చట్టాలు గౌరవింపబడడమే కాకుండా అది పకడ్బందీగా అమలయ్యేలా పాలకులు చొరవ తీసుకోవాలన్నారు. ఈ సదస్సులో ప్రజ్ఞాభారతి చైర్మన్ పద్మశ్రీ డాక్టర్ చౌదరి, అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రఘు, ఉపాధ్యక్షురాలు విజయభారతి, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఎల్వీ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

## అంబేద్కర్ ఓపెన్ వర్సిటీలో క్రీడాపోటీలు ప్రారంభం



బంజారాహిల్స్, మార్చి 30: డా.బీఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలను పురస్కరించుకుని జూబ్లీహిల్స్‌లోని డా.బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో శనివారం క్రీడా పోటీలను వైస్ చాన్స్‌లర్ ప్రొ.కె.సీతారామారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగులు ప్రతిరోజూ వ్యాయామం చేయడంతో పాటు తమకు నచ్చిన క్రీడల్లో పాల్గొనాలని సూచించారు. క్రీడలతోనే ఆరోగ్యంతోపాటు ఉత్సాహం ఉంటుందన్నారు. యూనివర్సిటీ ప్రాంగణంలో త్వరలో అన్ని వసతులతో క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొ.ఏవీఆర్ఎన్.రెడ్డి, బోధనేతర ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు జి.మహేశ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి వీఎం శర్మ, ఎం.బుద్ధ, మహేశ్‌బాబు, విశ్వనాథ్ పాల్గొన్నారు.

## జాస్మిన్ హై స్కూల్‌లో గ్రాడ్యుయేషన్ డే..

జూబ్లీహిల్స్, మార్చి 30 : రాజీవ్‌నగర్‌లోని జాస్మిన్ హైస్కూల్‌లో ప్రీ ప్రైమరీ విద్యార్థులకు శనివారం గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ జగన్నాథం మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలంటే పాఠశాలలో వేసే పునాది బలంగా ఉండాలన్నారు. ఇందుకుగానూ విద్యార్థులు చిన్ననాటి నుంచే అన్ని రంగాల్లో నైపుణ్యం సాధించాలన్నారు. ఈ సందర్భంగా చిన్నారులకు పట్టాలు అందజేసి అభినందించారు. వేడుకల్లో భాగంగా చిన్నారులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. హెచ్ఎం విజయలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



జాస్మిన్ పాఠశాలలో చిన్నారులకు పట్టాలు అందజేసిన పాఠశాల చైర్మన్ జగన్నాథం

## అన్ని రంగాల్లో నైపుణ్యం పెంచుకోవాలి

మణికొండ, మార్చి 30: విద్యార్థులు అన్ని రంగాల్లో నైపుణ్యాన్ని పెంచుకొని.. తమ మెదస్సుకు పదును పెట్టాలని ఎంజీఐటీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. గండిపేట్‌లోని మహత్మ గాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి చెందిన పన్నెండు మంది విద్యార్థులు ఉస్మానియా యూనివర్సిటీ జర్నలిజం, మాస్ కమ్యూనికేషన్ విభాగం నిర్వహించిన జశ్న్–ఎ–సైన్మా జాతీయ స్థాయి షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో పాల్గొన్నారు. ఈ జాతీయ స్థాయి ఫెస్టివల్ తెలంగాణ ప్రభుత్వం–భాషా, సంస్కృతి విభాగంవారి సహకారంతో మార్చి 27,28 తేదీల్లో యూనివర్సిటీలోని ఠాగూర్ ఆడిటోరియంలో నిర్వహించారన్నారు. ఇందులో వివిధ కళాశాలల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారన్నారు. మార్చి 28న నిర్వహించిన ఓపెన్ స్టేజీ కాంపిటిషన్(నృత్య ప్రదర్శన)లో భాగంగా ఎంజీఐటీ విద్యార్థులు మొదటి బహుమతి సాధించారన్నారు. విజేతలకు కాలేజీ యాజమన్యాం, ప్రిన్సిపల్, అధ్యాపకులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

## అక్రమ నిర్మాణాలు.. పట్టించుకోని అధికారులు

బండ్లగూడ,మార్చి 30 : బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో టౌన్ ప్లానింగ్ అధికారుల ఇష్టారాజ్యం కొనసాగుతుంది. కార్పొరేషన్ పరిధిలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా అధికారులు తమకేమి పట్టనట్లు వ్యవరిస్తున్నారు. నిర్మాణదారులు రెండు అంతస్తుల భవనానికి అనుమతులు తీసుకుని ఇష్టానుసారంగా ఐదు అంతస్తులు నిర్మిస్తున్నా పట్టించుకోవడం లేదు. అక్రమ నిర్మాణాలపై స్థానికులు ఫిర్యాదులు చేస్తే నోటీసులు ఇచ్చామంటూ దాటవేస్తున్నారు. కాగా..అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని కార్పొరేటర్ లతాప్రేమ్ గౌడ్ పేర్కొ న్నారు. అక్రమ నిర్మాణాలపై అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. ఈ అక్రమ నిర్మాణాలపై డిప్యూటీ సిటీ ప్లానర్ సాంబయ్యకు 'నమస్తే తెలంగాణ' పలుమార్లు ఫోన్ చేసినా స్పందించలేదు. టౌన్ ప్లానింగ్ అధికారిణి విజయలక్ష్మిని వివరణ కోరగా ఆమె సోమావారం పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## అవకాడోకు ప్రపంచ వ్యాప్తంగా అధిక డిమాండ్

### వీసీ నీరజా ప్రభాకర్





అవగాహన సదస్సులో మాట్లాడుతున్న వీసీ నీరజా ప్రభాకర్, తదితరులు

వ్యవసాయ యూనివర్సిటీ , మార్చి 30 : అవకాడో వంటి అధిక డిమాండ్ గల పంటలు పండించడానికి తెలంగాణ నేలలు , వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని కొండాలక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వ విద్యాలయం ఉపకులపతి డా. నీరజా ప్రభాకర్ తెలిపారు. శనివారం కొండాలక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ ఉద్యాన కళాశాల సమావేశపు మందిరంలో జీడెక్కన్‌ఎక్కోటిక్స్ సహకారంతో శాస్త్రీయ పరిజ్ఞానం, అవకాడో తోటల పెంపకంపై అవగాహన సదస్సు నిర్వహించారు . ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ.. అదిలాబాద్, అశ్వరావుపేట పరిశోధనా కేంద్రంలో కూడా నూతన శాస్త్రీయ పరిజ్ఞానంతో అవకాడోపై పరిశోధన జరిపి వాటి ఫలితాలపై రాష్ట్రంలో ఆ మొక్కల పెంపకం , క్షేత్రస్థాయిలో ఆచరించాల్సిన పరిజ్ఞానాన్ని రైతులకు అందించనున్నామన్నారు. ప్రస్తుతం అధిక పోషకాలు కల్గి మంచి డిమాండ్ ఉన్న పంట అని తెలిపారు. ఇది తక్కువ నీటితో ఎక్కువ సాగు చేయవచ్చన్నారు. కిలోకు దాదాపు రూ.400 నుంచి రూ. 600 వరకు డిమాండ్ ఉంటుందన్నారు. ప్రపంచ స్థాయిలో గర్వించదగ్గదని ప్రొ. జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి ప్రవీణ్ రావు సూచించారు. నేషనల్ బ్యూరో ఆఫ్ సైన్స్ సహకారంతో తోటలు పెంచే నేలలు సమగ్ర సమాచారాన్ని తెలుసుకున్నామని పేర్కొన్నారు. తొలిసారిగా రైతు శ్రీనివాస్‌రావు నిర్వహిస్తున్న అవకాడో క్షేత్రాన్ని సందర్శించాలని సూచించారు. డీజీ క్వాలిటీ కంట్రోల్ హస్కల్బర్ల్ నర్సరీ, ఇజ్రాయిల్‌లో పండ్ల ప్రాముఖ్య త తెలిసి.. వారు అధికంగా అవకాడో పండిస్తున్నారని తెలిపారు. అవకాడో పంటను పండించే విధానం, నిల్వ ఉంచే పద్ధతులు, ఇతర దేశాలకు ఎగుమతి అవకాశాలు పరిశోధనా సంచాలకులు కిరణ్ కుమార్, డీన్‌ఆఫ్ హార్టికల్చర్ డా.రాజశేఖర్, అసోషియేట్ డీన్ ప్ర శాంత్ ,బెంగుళూర్ ఐఐహెచ్ఆర్ ప్రిన్సిపాల్ కరుణాకర్‌పాల్గొని తగు సూచనలు ఇచ్చారు.

## ముదిరాజ్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలి



సమావేశంలో మాట్లాడుతున్న చొప్పరి శంకర్ ముదిరాజ్

హిమాయత్‌నగర్,మార్చి30: లోక్‌సభ ఎన్నికల్లో ఎంపీలుగా పోటీ చేస్తున్న ముదిరాజ్ సామాజిక వర్గం అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలుపించుకోవాలని తెలంగాణ మన ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చొప్పరి శంకర్ ముదిరాజ్ పిలుపు నిచ్చారు. శనివారం నారాయణగూడలో మహాసభ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంపీలుగా ముదిరాజ్ అభ్యర్థులు గెలిస్తే దేశ సమస్యలు, రాష్ట్ర అభివృద్ధి, ముదిరాజ్‌ల సమస్యలను పరిష్కారానికిపాటుపడే అవకాశం ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గత 44 ఏండ్ల తరువాత ముగ్గురు అభ్యర్థులకు అవకాశం లభించిందని, బీఆర్ఎస్ పార్టీ నుంచి చేవెళ్ల ఎంపీగా కాసాని జ్ఞానేశ్వర్, బీజేపీ నుంచి మల్కాజిగిరి ఎంపీగా ఈటల రాజేందర్, కాంగ్రెస్ నుంచి మెదక్ ఎంపీగా నీలం మధు పోటీలో ఉన్నారని తెలిపారు. ఇంతకాలం ఇతర కులాల అభ్యర్థులకు ఓట్లువేసి గెలిపించామని పార్టీలు, సంఘాలకు అతీతంగా ముగ్గురు ముదిరాజ్ అభ్యర్థులను గెలిపించుకునేందుకు కలిసికట్టుగా ముందుకు సాగాలని ముదిరాజ్ కులస్తులకు పిలుపు నిచ్చా రు. ఈ సమావేశంలో మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు శైలేంద్ర శివయ్య, మద్దెల సంతోష్, బోళ్ల కరుణాకర్‌ముదిరాజ్, అంజయ్య,బైరి శంకర్, రాష్ట్ర కోశాధికారి బైండ్ల సత్యనారాయణ,సోషల్ మీడియా కన్వీనర్ గోపిరాజ్ పాల్గొన్నారు.

## రైతులకు రుణాలు ఇచ్చి ఆదుకుంటాం..

### చిన్నగోల్కొండ సహకార సంఘం చైర్మన్ దౌణాకర్‌గౌడ్




చిన్న గోల్కొండ సహకార సంఘం సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ దౌణాకర్‌గౌడ్

శంషాబాద్ రూరల్, మార్చి 30 : రైతులకు రుణాలు ఇచ్చి ఆదుకోవడానికి తమవంతు కృషి చేస్తామని చిన్నగోల్కొండ సహకార సంఘం చైర్మన్ దౌణాకర్ గౌడ్ అన్నారు. శనివారం మండలంలోని చిన్నగోల్కొండ సహకార సంఘంలో రైతులతో ఆయన ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సహకార సంఘం ద్వారా రైతులకు స్వల్ప కాలిక, దీర్ఘకాలిక రుణాలు ఇవ్వడంతోపాటు చేతివృత్తులవారికి బ్యాంకు నుంచి ఏ విధంగా సహాయం చేయాలి అనే విషయంపై పాలకవర్గంలో చర్చించినట్లు వివరించారు. బ్యాంకు అందించే సేవలతోపాటు సొసైటీని ఏ విధంగా ముందుకు తీసుకుపోవడానికి పాలకవర్గం చేస్తున్న కృషిని వివరించారు. ఇప్పటి వరకు రైతులకు భారీగా రుణాలు అందించినట్లు చెప్పారు. బహదూర్‌గూడ గ్రామానికి చెందిన రైతులు తమకు రుణాలు ఇవ్వాలని కోరగా ..స్థానిక డైరెక్టర్ ద్వారా వచ్చి రుణాలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో సహకార సంఘం డైరెక్టర్లు దేవేందర్‌రెడ్డి, మంచర్ల మోహన్‌రావు, ప్రశాంత్‌రెడ్డి, బాల్యానాయక్, విజయలక్ష్మి, బల్వాంత్, సీఈవో యాదయ్య, సిబ్బంది సురేశ్, మధుమతి, జగపతిబాబు, వివిధ గ్రామాల రైతులు బాల్‌రెడ్డి, ధన్‌పాల్‌రెడ్డి, గడ్డం అశోక్‌యాదవ్, శ్రీనివాస్, అంజయ్యగౌడ్, కొమరయ్య, మంచాల రవి, జగన్, వెంకటేశ్‌తో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

## అక్రమంగా గ్యాస్ రీఫిల్లింగ్.. కేసు నమోదు

బంజారాహిల్స్,మార్చి 30: నిబంధనలకు విరుద్ధంగా గ్యాస్ రీఫిల్లింగ్ చేస్తున్న వ్యక్తిపై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. బంజారాహిల్స్ రోడ్ నం.11లోని ఉదయ్‌నగర్‌లో నివాసం ఉంటున్న తిప్పనపల్లి ఉదయ్ అనే వ్యక్తి గత కొంత కాలంగా డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ల నుంచి మినీ సిలిండర్లలోకి గ్యాస్ నింపి విక్రయిస్తున్నాడు. సమాచారం అందుకున్న బంజారాహిల్స్ పోలీసులు శుక్రవారం రాత్రి అతని ఇంటిపై దాడిచేసి.. నాలుగు పెద్ద సిలిండర్లు, 9 చిన్న సిలిండర్లు, రీఫిల్లింగ్ సామగ్రి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు ఉదయ్ మీద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## బాలుడు అదృశ్యం



రోహన్(ఫైల్)

మైలార్‌దేవ్‌పల్లి, మార్చి 30: ఇంటి వద్ద ఆడుకుంటున్న ఓ బాలుడు తప్పిపోయాడు. ఈ సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై కృష్ణయ్య తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన రామ్‌రాజ్ ప్రజాపతి, నీలం దంపతులు.. తమ ఇద్దరు పిల్లలతో కలిసి మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బృందావన్ కాలనీలో నివాసం ఉంటున్నారు. శుక్రవారం తల్లిదండ్రులు పనినిమిత్తం బయటకు వెళ్లగా ఇంటివద్ద రోహన్ (10), వారి తమ్ముడు ఆడుకుంటూ ఉన్నారు. ఈ క్రమంలో రోహన్ కనిపించకుండాపోయాడు. దీంతో కుటుంబ సభ్యులు చుట్టు పక్కల ప్రాంతాల్లో గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు.

## ఆటో చోరీ..

వెంగళరావునగర్, మార్చి 30: రోడ్డు పక్కన పార్కింగ్ చేసిన ఆటో చోరీకి గురైంది. మధురానగర్ పోలీసుల కథనం ప్రకారం..ఎల్లారెడ్డిగూడలో నివాసం ఉండే ఆటో డ్రైవర్ మహ్మద్ రషీద్ శుక్రవారం రాత్రి ఎల్లారెడ్డిగూడ లా కళాశాల ఎదుట రోడ్డుపై ఆటోను పార్కు చేసి ఇంటికి వెళ్లారు. రెండు గంటల తర్వాత వచ్చిచూడగా ఆటో కనిపిం చకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేపట్టారు.